
నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | సోమవారం 24 జూన్ 2024 | MAHABUBABAD



జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ చేతిలోంచి మైక్ లాక్కుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# అంబేద్కర్ సాక్షిగా అవమానం

- విగ్రహావిష్కరణ సభలో దళిత ప్రజాప్రతినిధికి పరాభవం
- వేదికపై మాట్లాడుతుండగానే చేతిలో నుంచి మైకు లాక్కున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- నిరాశతో వెనుదిరిగిన మారెపల్లి సుధీర్‌కుమార్
- భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో ఘటన

భీమదేవరపల్లి, జూన్ 23 : బీఆర్ అంబేద్కర్ సాక్షిగా దళిత ప్రజాప్రతినిధికి పరాభవం ఎదురైంది. నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వేదికపై మాట్లాడుతున్న హనుమకొండ జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ చేతిలో నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ మైకును లాక్కొని అవమానపరిచారు. దీంతో అక్కడున్న వారంతా నిశ్చేష్టులయ్యారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు జడ్పీచైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో జడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడు కావడం అభినందనీయమన్నారు. ఇదే క్రమంలో బీసీ కోటాలో పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి అయితే తానే మొదటగా సంతోషిస్తానన్నారు. గత ప్రభుత్వం 239 ఉన్న ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్లను 1000కి పెంచినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్ల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పేరిట అప్పటి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పేరుమీద దళిత, గిరిజనుల ఒక్కో కుటుంబానికి రూ.12లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ తరుణంలో పక్కనే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకుని అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో రాజకీయాలు మాట్లాడొద్దంటూ జడ్పీ చైర్మన్ చేతిలోనుంచి మైకును లాక్కున్నారు. ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు జడ్పీచైర్మన్ పలుమార్లు మైక్ అడిగినా ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. వేదిక సమీపంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు 'జై కాంగ్రెస్..డౌన్ డౌన్ బీఆర్ఎస్' అంటూ నినాదాలు చేయడంతో గందరగోళం ఏర్పడింది.

## రాజకీయాలు ప్రస్తావించలేదు

– జడ్పీచైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్

గాంధీనగర్ విగ్రహావిష్కరణ సభలో ఎక్కడా రాజకీయాలు ప్రస్తావించలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ అంచెలంచెలుగా ఎదిగారని, బీసీ కోటాలో ముఖ్యమంత్రి అయితే తానే మొదటగా సంతోషిస్తానని చెప్పాను. ఎస్సీ విద్యార్థుల సంక్షేమం కోసం రెసిడెన్షియల్ స్కూళ్ల సంఖ్యను మరింతగా పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. ఇప్పటి ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళిత, గిరిజనులకు ఒక్కో కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశాను. జడ్పీచైర్మన్ హోదాలో రాజకీయాలకతీతంగా మాట్లాడుతుంటే మంత్రి పొన్నం ప్రభాకర్ తన వద్దకు వచ్చి చేతిలోంచి మైక్ లాక్కొని అవమాన పరిచారు.


# నేటి నుంచి నిరవధిక సమ్మె

- నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఉపకార వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు
- జూనియర్ డాక్టర్ల ఆవేదన



ఎంజీఎం దవాఖానలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

కాశీబుగ్గ, జూన్ 23: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎంజీఎం దవాఖానలో వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన రాలేదని, మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఎమర్జెన్సీ మినహా.. అన్ని వైద్య సేవలకు తాము దూరంగా ఉండనున్నట్లు స్పష్టం చేశారు. తమకు సకాలంలో ఉపకార వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో సరిపడా సిబ్బంది, వైద్య పరికరాలు, భవనాలు, సదుపాయాలు లేవని, వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు. కేఎంసీలో అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా మారాయని, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అలాగే, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.



# రాష్ట్రం రాక ముందు కరెంట్‌కు కట్‌కట

రాష్ట్రం రాకముందు కరెంట్ ఎప్పడొస్తదో, ఎప్పడు పోతదో తెల్వదు. కోతలతో ఇబ్బందులు పడ్డం. చుక్కనీరందక వ్యవసాయ భూములు నెర్రెలు బారాయి. రెండు, మూడు గంటలు ఇచ్చే కరెంట్‌తో పనులు కుంటుపడ్డయ్. కేసీఆర్ వచ్చినంకనే నిరంతర విద్యుత్‌తో పదేండ్లు పండుగలా ఎవుసం చేసుకున్నం. పంటలు మంచిగ పండించుకున్నం. రాత్రిపూట పొలం కాడికి పోవుడు తప్పింది. ప్రాజెక్టులు కట్టి మస్తు నీళ్లిచ్చిండు. 24 గంటల కరెంట్‌తో చేతి నిండా పని దొరికింది. విద్యుత్ సమస్యల్లేకుండా తెలంగాణ తలరాతను మార్చిన పెద్దాయనపై నిందలేయడం సరికాదు. 2014కు ముందున్న కష్టాలే మళ్లా ఇప్పుడు కాంగ్రెసోళ్లు అచ్చినంక మొదలైనయ్. చెప్పకుండా కోతలు పెడుతున్నరు. యాసంగిలో కరెంట్ లేక పంటలు ఎండిపోయినయ్. నీళ్ల కోసం అరిగోసపడ్డం. ఈ సీజన్‌లోనైనా సక్కగ వస్తదో, రాదో తెలుస్తలేదు. ఇప్పడే ఇన్ని కష్టాలుంటే మున్ముందు ఎలాగుంటుందో' అని రైతులు, చిరు వ్యాపారులు తమ మనోగతాన్ని వెల్లడించారు.

*- నమస్తే నెట్‌వర్క్, జూన్ 23*

- పదేండ్లు పండుగలా ఎవుసం
- చేతినిండా పనిచేసుకున్న చిరు వ్యాపారులు
- కరెంట్ విషయంలో పెద్దాయనపై నిందలేయడం సరికాదు
- మళ్లీ 2014కు ముందు పరిస్థితులే పునరావృతం
- యాసంగిలో కరెంట్ లేక ఎండిన పంటలు
- రైతులు, చిరు వ్యాపారుల మనోగతం



## 2014కు ముందు చేతినిండా పనిలేదు

కమలాపూర్ : తెలంగాణ రాక ముందు కరెంట్ ఎప్పుడొస్తదో ఎప్పుడు పోతదో తెలియక పోయేది. పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డం. రెండు, మూడు గంటలు ఇచ్చే కరెంట్‌తో వెల్డింగ్ పనులు కుంటుపడ్డయ్. కేసీఆర్ వచ్చినంక 24గంటలివ్వడంతో చేతినిండా పనిదొరికి నాతో పాటు ఒకరికి ఉపాధి కల్పిస్తున్న. పదేళ్లుగా మాలాంటి చిన్న చిన్న వెల్డర్లకు ఊరట కలిగింది. కరంటు ఉంటేనే మాపని అవుతుది. లేకుంటే ఖాళీగా ఉండాల్సి వస్తది. 2014కు ముందు, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారే ఉన్నది. మళ్ల కరంటు కోతలు ఉంటాయని భయమైతాంది. కరెంటిచ్చిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటు.

– చెంగెల్లి రాము, వెల్డర్, ఉప్పల్

## కేసీఆర్ వచ్చినంకనే నిరంతర విద్యుత్





## పంటలు మంచిగ పండించుకున్నం

జనగామ(నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంల రైతులు అనుభవించిన కష్టాలు చెప్పుకుంటపోతే ఒడవవు. జనగామ ప్రాంతంలో ఎటు చూసినా బీడు భూములు.. చుక్క నీరందక నెర్రెలు బారిన పొలాలు.. కరెంట్ ఎప్పుడత్తదో, పోతదో తెల్వదు. పొలాలకు నీళ్లందక పంటలు సక్కగ పండకపోయేది. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ సారు 24 గంటలు మంచి కరెంట్ ఇచ్చిండు. సంబురంగా ఎవుసం చేసుకున్నం. ప్రాజెక్టులు కట్టి మస్తు నీళ్లిచ్చుడు తోటి పంటలు బాగా పండించినం. జనగామ ప్రాంతమంతా పచ్చబడ్డది. కరెంటు విషయంలో ఆయనను బద్‌నాం చేయడం సరికాదు. రాజకీయ కక్షతోనే అభాండాలు వేస్తున్నరు. ఆనాడు కేసీఆర్ కరెంటు ఇవ్వకుంటే ఇప్పుడు రైతుల పరిస్థితి ఎట్లుండేది. ఆయన తప్పులు చేసిండని అనడం మంచి పద్ధతి కాదు. *– నకీర్త ఐలయ్య, రైతు, కొత్తపల్లి, లింగాలఘనపురం మండలం*

## చిరు వ్యాపారులకు కష్టంగా ఉండేది



గిర్మాజీపేట : 2014కు ముందు కరెంట్ లేక చిన్న వ్యాపారాలు చేసుకునేటోళ్లకు మస్తు కష్టంగ ఉండేది. ఎప్పుడు అత్తదో, ఎప్పుడు పోతదో తెల్వక ఇబ్బందులు పడేటోళ్లం. కరెంట్ సక్కగ ఇయ్యకపోవడంతో గిరాకీ అచ్చేది కాదు. పూట గడవడం కూడా కష్టంగా ఉండేటిది. తెలంగాణ అచ్చి, కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక అందరు మంచిగుండాలని 24 గంటల కరెంటిచ్చిండు. మాలాంటి చిన్న వ్యాపారం చేసుకునేటోళ్లకు గిరాకీ పెరుగుడుతోటి కుటుంబాలు మంచిగైనయ్. సంతోషంగా బతికింర్రు. మళ్లా ఇప్పుడు కాంగ్రెసోళ్లు అచ్చినంక కష్టాలు మొదలైనయ్. చెప్పకుండా కోతలు పెడుతుంటే ఇబ్బందులు పడుతున్నం. కేసీఆర్ సారు ఎట్ల కొన్నడో కానీ కరెంటు మంచిగిచ్చిండు. విద్యుత్ సమస్యల్లేకుండా తెలంగాణ తలరాతను మార్చిన కేసీఆర్‌పై నిందలేయడం సరికాదు.

– మణెక్క, చిరు వ్యాపారి, పెరుకవాడ, వరంగల్

## రాష్ట్రం వచ్చినంక కరెంట్ తిప్పలు లేవు



పెద్దవంగర: పదేండ్లు మాకు కరెంట్ కష్టాలే తెల్వదు. కేసీఆర్ సార్ ఎక్కడి నుంచి తెచ్చిండో ఏమో గానీ, మేము ఎప్పుడు కరెంటు కోసం ఎదురు చూడలే. వ్యవసాయం పండుగలా చేసుకున్నం. కాంగ్రెస్ వచ్చినంక తెలంగాణ రాకముందు ఎలాంటి కష్టాలు పడ్డామో, మళ్ల ఇప్పుడు ఆ పరిస్థితి ఏర్పడింది. ఈ యాసంగిల పడిన కష్టాలు ఎప్పుడూ పడలేదు. వేసిన వరికి సరిగా నీరందక, కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డం. వానకాలంలోనైనా కరెంట్ సక్కగ వస్తదో, రాదో తెలుస్తలేదు. ఇప్పుడే ఇన్ని కష్టాలు ఉంటే.. మున్ముందు ఇంకెన్ని కష్టాలుంటాయో.

– కసరబోయిన అంజయ్య, కొరిపెల్లి, పెద్దవంగర

## రైతుల గోసలు తీర్చింది కేసీఆర్ సారే



టేకుమట్ల: కేసీఆర్ సారు రాక ముందు కరెంట్ సరిగా రాక, లో వోల్టేజీతో మోటర్లు కాలి పోయేటివి. రాత్రి బావుల కాడ పండుకుని చలికి వణుకుతూ, పాములు, తేళ్లకు, అడవి జంతువులకు భయపడుతూ పంటకు నీరు పెట్టేందుకు అరిగోస పడ్డం. కేసీఆర్ సారు వచ్చినంక 24 గంటల కరెంటిచ్చి, చెరువులు, కెనాళ్లకు నీళ్లు ఇడిసిపెట్టి బావుల్లల్ల పుష్కలంగా నీళ్లు ఉండేలా చేసిండు. మేము ఎప్పుడు తీరిక దొరికితే అప్పుడు పోయి పంటలకు నీళ్లు పెట్టేలా చేసిండు. మళ్ల ఇప్పుడు యాసంగి పంటకు బావులు ఎండిపోయినయ్. కరెంట్ సక్కగ లేక మోటర్లు నడవక గోస పడ్డం.

– డ్యాగరి ఓదెలు, రైతు, వెంకట్రావ్‌పల్లి, టేకుమట్ల

# ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

- 'బొగత'లో కానరాని వసతులు
- తెరుచుకోని రెస్టారెంట్..మూలన పడిన వాహనాలు
- పర్యాటకులు డేంజర్ జోన్‌లోకి వెళ్తున్నా పట్టించుకోని అధికారులు

వాజేడు, జూన్ 23: మండలంలోని తెలంగాణ నయాగర బొగత జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులను పలు సమస్యలు వేధిస్తున్నాయి. పర్యాటకులు, చిన్నారులు ఆడుకునే తాళ్లబ్రిడ్జి తెగిపోయింది. చిల్డ్రన్స్ పార్క్ వద్ద బంగీ జంపు సైతం పనిచేయడంలేదు. పార్కింగ్ నుంచి జలపాతం వరకు రూ. 5 తీసుకొని తరలించే బొగత రైడర్ వాహనం, బ్యాటరీ టాప్ ఆటోలు మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా మోక్షం లేదు. దీంతో కిలోమీటర్ మేర నడిచిరావాలంటే వృద్ధులు, నడవలేని వారు ఇబ్బందులు పడుతున్నారు. జిప్‌లైన్, సైక్లింగ్‌తోపాటు తాగునీటికీ గతి లేదు. బొగత రెస్టారెంట్ మూతపడి మూడేళ్లు గడుస్తున్నా తెరుచుకోవడం లేదు. జలపాతం వద్ద సౌకర్యాలు లేకపోవడంపై పర్యాటకులు పెదవి విరుస్తున్నారు. ఆదాయం బాగానే వస్తున్నా సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ఇక్కడ అధికా రులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పర్యాటకులను గతంలో స్విమ్మింగ్ పూల్ వరకు మాత్రమే అనుమతించేవారు. ప్రస్తుతం లోతులోకి వెళ్లి స్విమ్మింగ్ చేస్తుండడంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఇదేవిధంగా లోపలికి వెళ్లి 20 మందికి పైగా మృత్యువాతపడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యాటకులు జలపాతం లోపలికి వెళ్లి ఈత కొట్టకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**జలపాతంలో సండే సందడి**

బొగత జలపాతాన్ని వీక్షించేందుకు ఆదివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పర్యటకులు తరలివచ్చారు. జలపాతం ముందు భాగంలో ఉన్న నీటిలో దిగి స్నానాలు చేస్తూ ఈతలు కొడుతూ సందడి చేశారు.



రక్షణ కంచె లేకపోవడంతో జలపాతంలోకి దిగి ఈత కొడుతున్న పర్యాటకులు



పిచ్చిమొక్కలతో అధ్వానంగా చిల్డ్రన్స్ పార్క్




మూలనపడ్డ బ్యాటరీ ఆటోలు

# కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు

## జాప్యంపై ట్రాన్స్‌కో సీఎండీ ఆగ్రహం

నమస్తే ఎఫెక్ట్

దేవరుప్పుల, జూన్ 23 : జనగామ జిల్లా దేవరుప్పులలో ఎస్ఎస్ –39 ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌కో అధికారులు బిగించారు. దేవరుప్పులలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులైనా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు పోసుకున్న నార్లు, దున్నిన దుక్కులు ఎండిపోయాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలో 'ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులాయె' శీర్షికతో ఆదివారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో సీఎండీ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో కదిలిన యంత్రాంగం వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి రైతుల కష్టాలను తీర్చింది.



దేవరుప్పులలో బిగించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

# డీఆర్, సబ్ రిజిస్ట్రార్లతో డీఐజీ భేటీ

- మార్కెట్ విలువ పెంపుపై సమీక్ష
- కమిటీ ఆమోదానికి ప్రతిపాదనలు
- 15 వరకు ప్రజాభిప్రాయ సేకరణ

హనుమకొండ, జూన్ 23 : రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో భూముల మార్కెట్ విలువ పెంపుపై కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగంగా వరంగల్ డీఐజీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో డీఐజీ ఎం సుభాషిణి ఆదివారం హనుమకొండ రామకృష్ణకాలనీలోని డీఐజీ ఆఫీసులో భేటీ అయ్యారు. మార్కెట్ విలువ పెంపుపై సమీక్షించారు. ప్రస్తుత విలువ, మార్కెట్ విలువలపై ఆరా తీసినట్లు తెలిసింది. ప్రొఫార్మా ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 198 ప్రాతిపదికన భూమి మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్లను నిర్ధారించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి 29న మార్కెట్ వ్యాల్యూ కమిటీకి డ్రాఫ్ట్ అప్రూవల్‌కు పంపించాలన్నారు. కమిటీ ఆమోదించిన తర్వాత జూలై ఒకటవ తేదీలోగా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలను పొందుపరుస్తారు. 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించి, అభ్యంతరాలు వస్తే పరిష్కరిస్తారు. ఒక వేల ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే వాటిని ఫైనల్ చేసి జూలై 31వ తేదీలోగా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఆగస్టు 1 నుంచి అమలు కానున్నట్లు అధికారులు తెలిపారు.